సాక్షి సంగారెడ్డి

ఆదివారం । 16 । ఏప్రిల్ । 2023

అయ్యో పాపం



అప్పుడే పుట్టిన ఆడశిశువును గుర్తుతెలియని వ్యక్తులు రోడ్డు పక్కన వదిలివెళ్లారు. ఈ దయనీయ ఘటన భానూర్ – బీడీఎల్ పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. 8లో




సాఫ్ట్‌వేర్ ఉద్యోగినికి బురిడీ

పార్ట్ టైం జాబ్ ఆఫర్ అంటూ అపరిచిత వ్యక్తి నుంచి వచ్చిన వాట్సాప్ మెసేజ్‌కు స్పందించిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని పెద్దమొత్తంలో నగదు పోగొట్టుకుంది. 8లో

ఇద్దరికి కరోనా పాజిటివ్



పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో కరోనా నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. శనివారం 21 మందికి కోవిడ్ ర్యాపిడ్ టెస్టులు నిర్వహించగా అందులో ఇద్దరికి పాజిటివ్ వచ్చినట్లు టెస్టుల నిర్వాహకుడు మనోహర్ తెలిపారు. అదేవిధంగా ఆర్టీపీసీఆర్ టెస్టులు 19 మందికి నిర్వహించినట్లు పేర్కొన్నారు.



న్యూస్‌రీల్

వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలి



మాట్లాడుతున్న సాయిలు

కొండాపూర్(సంగారెడ్డి): ఇందిరా క్రాంతి పథకంలో పని చేస్తున్న వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సాయిలు డిమాండ్ చేశారు. శనివారం సంగారెడ్డిలోని సుందరయ్య భవన్‌లో నిర్వహించిన ఐకేపీ వీఓఏల సమావేశానికి హాజరై మాట్లాడారు. 19 సంవత్సరాలుగా ప్రభుత్వానికి అనేక రకాల పనులు చేస్తున్నా ఐకేపీ వీఓఏలకు కనీస వేతనం, ఉద్యోగ భద్రత లేదన్నారు. నెలకు వచ్చే రూ.3,900తో కుటుంబాన్ని ఎలా పోషిస్తారని ప్రశ్నించారు. వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించడంతో పాటు కనీస వేతనం రూ.26,000 ఇవ్వాలని, ప్రమాద బీమా రూ.10 లక్షలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ భద్రత, ఇతర సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 17 నుంచి రాష్ట్రవ్యాప్తంగా వీఓఏలు సమ్మెకు వెళ్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వీఓఏల సంఘం జిల్లా నాయకులు ముస్తఫా, మల్లయ్య, అనిత, ఆంజనేయులు, ప్రవీణ్, భాగ్యలక్ష్మి, సుధాకర్, సంజీవ్, మంజుల తదితరులు పాల్గొన్నారు.

ఒకటో తరగతిలో ప్రవేశాలు

సంగారెడ్డి టౌన్: వచ్చే విద్య సంవత్సరానికి సంబంధించి ఒకటో తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ అధికారి జగదీశ్ ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ బేగంపేట్‌లో 02 సీట్లు, రామంతపూర్‌లో ఒకటి ఉన్నట్లు పేర్కొన్నారు. ఒకటో తరగతి ఇంగ్లిష్ మీడియంలో జిల్లాకు చెందిన షెడ్యూలు కులాల బాల బాలికలను ఎంపిక చేస్తారని, ఒకటో తరగతి ప్రవేశానికి 2017 జనవరి 1 నుంచి 2017 డిసెంబర్ 31 మధ్యలో జన్మించిన వారై ఉండాలని తెలిపారు. ఈనెల 17 నుంచి మే ఒకటో తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మే 4వ తేదీన డ్రా తీస్తారని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

అంబేడ్కర్ అడుగుజాడల్లో నడుచుకోవాలి



పూజలు చేస్తున్న అడిషనల్ ఎస్పీ ఉషావిశ్వనాథ్

ఝరాసంగం(జహీరాబాద్): జిల్లాలో ఆధ్యాత్మిక క్షేత్రమైన దత్తగిరి మహారాజ్ ఆశ్రమంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. శనివారం ఆశ్రమ పీఠాధిపతులు 108 వైరాగ్య శిఖమని అవధూతగిరి మహారాజ్, డాక్టర్ సిద్ధేశ్వర స్వామి ఆధ్వర్యంలో జయంతి ఉత్సవాలకు నిర్వహించారు. ముందుగా గ్రామంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. అనంతరం ఆశ్రమ ఆవరణలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ ఉషావిశ్వనాథ్ మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా దత్తగిరి వైదిక పాఠశాలలో వైదికం నేర్పించడం, వసతి కల్పించడం అభినందనీయమన్నారు. ప్రతి ఒక్కరూ మానవత్వం కలిగి ఉండాలన్నారు. భారత రాజ్యాంగంలో రచించిన హక్కులు విధులతో పాటు తమ బాధ్యతలను నెరవేర్చాలని సూచించారు. ఆయన చూపిన అడుగుజాడల్లో నడుచుకోవాలన్నారు. ముందుగా ఆశ్రమానికి వచ్చిన అడిషనల్ ఎస్పీ ఆశ్రమంలోని జ్యోతిర్లింగాల వద్ద ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మాతృశ్రీ అనసూయ మాత, సామాజిక సమరస్త రాష్ట్ర కన్వీనర్ అప్పల ప్రసాద్, రంజోల్ ఆశ్రమ పీఠాధిపతి రాజయ్య స్వామి, ట్రస్ట్ చైర్మన్ అల్లాడి వీరేశం, ఎస్‌ఐ రాజేందర్ రెడ్డి, వివిధ పార్టీల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

పూత.. నిలబడని కాత

- అకాల వర్షాలకు దెబ్బతిన్న మామిడి
- పడిపోయిన దిగుబడి
- నష్టాల్లో రైతులు



జహీరాబాద్‌లోని మామిడి తోట

జహీరాబాద్ టౌన్: వాతావరణ మార్పులతో రెండేళ్లుగా మామిడి రైతులు నష్టాలు చవిచూస్తున్నారు. ఈ ఏడాది కాత మరీ తక్కువగా వచ్చింది. వర్షాల కారణంగా ఆలస్యంగా పూత పూసినా.. తెగుళ్ల ప్రభావంతో పిందెలు రాలి కాత నిలబడలేదు. అంతంతమాత్రంగా ఉన్న కాత అకాల వర్షాలతో నేలరాలింది. ఫలితంగా మామిడి రైతులు తీవ్రంగా నష్టపోవల్సి వచ్చింది. దిగుబడి గణనీయంగా తగ్గడంతో ఈ ఏడాది ఫలరాజైన మామిడికి డిమాండ్ పెరిగింది.

- జిల్లాలోని జహీరాబాద్, సంగారెడ్డి, పటాన్‌చెరు తదితర ప్రాంతాల్లో ఎక్కువ మామిడి తోటలు ఉన్నాయి. జహీరాబాద్ ప్రాంతం నేల మామిడికి అనుకూలంగా ఉండటంతో రైతులు వందల ఎకరాల్లో మామిడి తోటలు వేశారు. బంగినపల్లి, పెద్ద రసాలు, చిన్న రసాలు, కేసరి, మల్లిక, హిమాయత్, దసేహరి, మహమూద, తెల్లగులాబీ, పాపరావు గోవా, నీలాలు, తోతపరి, గోల, దేశి, సహజాన్ తదితర రకాల మామిడి తోటలు ఈ ప్రాంతంలో ఉన్నాయి. ఇక్కడ పండిన పంటలో 75 శాతం మహారాష్ట్ర(ముంబాయి), కర్ణాటకతో పాటు హైదరాబాద్‌కు ఎగుమతి అవుతుంది.

దెబ్బతీసిన వాతావరణం

- మామిడి రైతులకు దెబ్బమీద దెబ్బ పడుతోంది. రెండు సంవత్సరాల క్రితం విపరీతంగా కాత ఉండగా ధర లేదు. గత ఏడాది నుంచి ధర ఉన్నా దిగుబడి తగ్గింది. వాతావరణం అనుకూలించక పూత కాత తగ్గింది. భారీ వర్షాలతో పూత, కాత నేలరాలింది. చెట్లకు అక్కడక్కడ మాత్రమే కాయలు కనుబడుతున్నాయి. పంట దిగుబడి లేక రైతులు, వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు.

పెట్టుబడులు కూడా కష్టమే



ఈ ఏడాది వాతావరణంలో వచ్చిన మార్పులతో పూత కాత లేక పంట దెబ్బతిన్నది. కొద్దిపాటి ఉన్న కాత సైతం ఇటీవల కురిసిన అకాల వర్షాలకు నేలరాలింది. ఈసారి పంటకు పెట్టిన పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి కనిపించడంలేదు. రెండేళ్లుగా నష్టపోతున్నాం. ప్రభుత్వం మామిడి రైతులను ఆదుకోవాలి.

– శ్రీనివాస్, మామిడి రైతు, జహీరాబాద్

- ఈ ఏడాది 20 నుంచి 30 శాతం వరకు దిగుబడి వచ్చే అవకాశాలు ఉండగా ఒక్కసారిగా అకాల వర్షాలు దెబ్బతీశాయి. చెట్లకు ఉన్న కాతలో అధికశాతం గాలివానకు నేలరాలింది. చెట్లకు ఉన్న కాయలు, పిందెలకు వడగళ్ల దెబ్బతగిలింది. దీంతో కాయలు కుళ్లిపోతాయని రైతులు వాపోతున్నారు. కాత లేని కారణంగా ఈ సంవత్సరం మామిడి పండ్లు దొరకడం కష్టమని రైతులు చెబుతున్నారు. మామిడి సాగు చేస్తున్న రైతులు నష్టాలు చూస్తుండగా డిమాండ్ పెరిగి మార్కెట్‌లో ఎక్కువ రేటు పలుకుతోంది.



వర్షానికి రాలిన కాయలు(ఫైల్)

కల్యాణలక్ష్మి పేద కుటుంబాలకు వరం



కల్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేస్తున్న చింతా ప్రభాకర్ తదితరులు

రాష్ట్ర చేనేత అభివృద్ధి సంస్థ చైర్మన్ చింతా ప్రభాకర్

కొండాపూర్(సంగారెడ్డి): రాష్ట్ర ప్రభుత్వం పేదింటి ఆడపిల్ల కోసం అందించే షాదీముబారక్, కల్యాణలక్ష్మీ పథకాలు పేద కుటుంబాలకు వరం అని రాష్ట్ర చేనేత అభివృద్ధి సంస్థ చైర్మన్ చింతా ప్రభాకర్ అన్నారు. శనివారం మండలంలో పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. మల్లేపల్లి చెరువు కట్ట మరమ్మతులకు నీటి పారుదల శాఖ నిధులు రూ.45 లక్షలతో చేపట్టిన పనులను ప్రారంభించారు. తేర్పోల్ మధిర గ్రామమైన ఎదురుగూడెంలో మహిళా సమైక్య భవనాన్ని, వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. మండల కేంద్రం కొండాపూర్‌లో 49 లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ కల్యాణలక్ష్మి పథకం ప్రవేశపెట్టి పేదింటి ఆడపిల్లకు మేనమామగా నిలుస్తున్నారన్నారు. దేశంలో ఎక్కడాలేని విధంగా అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి ప్రతి ఇంటికీ లబ్ధి చేకూరేలా చూస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ వైస్ చైర్మన్ పట్నం మాణిక్యం, జెడ్పీటీసీ పద్మావతిపాండురంగం, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు విఠల్, నాయకులు భాస్కర్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, రుక్మొద్దీన్, జగదీశ్వర్, గీత, మౌనిక, ప్రభు, నర్సింహారెడ్డి తదితరులున్నారు.

తొలగించిన బోర్డు

రామచంద్రపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో స్వాగత బోర్డును సరిహద్దులో కాకుండా మరో చోట పెట్టడంపై సాక్షి దినపత్రికలో 14వ తేదీన ×రోడ్డు పక్కన సూర్య చంద్రుల హద్దు రాయి× అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి మున్సిపల్ అధికారులు స్పందించారు. వెంటనే రోడ్డు మధ్యలో పెట్టిన తెల్లాపూర్ మున్సిపల్ స్వాగత బోర్డును తొలగించారు.



స్వాగత బోర్డును తొలగిస్తున్న సిబ్బంది



ముస్లిం మహిళలకు సరుకులు పంపిణీ చేస్తున్న ఎంపీ ప్రభాకర్‌రెడ్డి, చింతా ప్రభాకర్

ప్రశాంత వాతావరణంలో పండగ జరుపుకోవాలి

మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి

సదాశివపేట(సంగారెడ్డి): పవిత్ర రంజాన్ పండుగను ముస్లింలు సోదరభావంతో ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి ఆకాంక్షించారు. రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని శనివారం పట్టణ పరిధిలోని బాలాజీ ఫంక్షన్‌హాలులో ప్రభుత్వం అధికారికంగా ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు రాష్ట్ర చేనేత అభివృద్ధి సంస్థ చైర్మన్ చింత ప్రభాకర్‌తో కలిసి ముస్లిం మహిళలకు సరుకులను పంపిణీ చేశారు. ఇఫ్తార్ విందుకు ముస్లిం మత పెద్దలు, ముస్లింలు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి సంవత్సరం ముస్లింలకు ఇఫ్తార్ విందుతో పాటు పండుగ సరుకులను పంపిణీ చేస్తోందన్నారు. ప్రభుత్వం మసీద్‌ల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ చింతా గోపాల్, కౌన్సిలర్లు పులిమామిడి రాజు, పిల్లోడి విశ్వనాథం, తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సంక్షేమానికి కృషి

పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: జర్నలిస్టుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి అన్నారు. ఇటీవల పటాన్‌చెరులో నిర్వహించిన ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ జాతీయ ప్లీనరీ, టీయూడబ్ల్యూజే హెచ్ 143వ రాష్ట్ర మహాసభల విజయవంతానికి సంపూర్ణ సహకారం అందించిన ఎమ్మెల్యేకు యూనియన్ ఆధ్వర్యంలో శనివారం కృతజ్ఞత సభ నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ వ్యవస్థాపక అధ్యక్షుడు అల్లం నారాయణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుతి సాగర్, ఐజేయూ జాతీయ ఉపాధ్యక్షుడు ఇస్మాయిల్, రాష్ట్ర నాయకులు రమణ, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డిల ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను శాలువా, మెమొంటోతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ.. జర్నలిస్టుల సంక్షేమానికి సీఎం కేసీఆర్ పెద్దపీట వేస్తున్నారన్నారు. నియోజకవర్గంలోనూ జర్నలిస్టుల సంక్షేమానికి ఎల్లప్పుడూ అండగా నిలుస్తున్నామని తెలిపారు. జర్నలిస్టులకు ఆరోగ్య భద్రత కార్డులు అందించడంతోపాటు ఇళ్ల స్థలాలను సైతం అందించబోతున్నట్లు తెలిపారు. పటాన్‌చెరు పట్టణంలోని జాతీయ రహదారి ప్రక్కన ప్రెస్ క్లబ్ భవన నిర్మాణ పనులు చేపట్టబోతున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో యూనియన్ జిల్లా, నియోజకవర్గ ప్రతినిధులు పాల్గొన్నారు.

పీఏసీఎస్ చైర్మన్‌పై నెగ్గిన అవిశ్వాసం



పీఏసీఎస్ కార్యాలయం ఎదుట సందడి

జహీరాబాద్: జహీరాబాద్ మండలంలోని ఇప్పపల్లి పీఏసీఎస్ చైర్మన్ కిషన్‌రావు పవార్‌పై సభ్యులు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గినట్లు డీసీఓ ప్రసాద్ వెల్లడించారు. శనివారం జహీరాబాద్ పట్టణంలోని పీఏసీఎస్ భవనంలో అవిశ్వాత తీర్మానంపై ఓటింగ్ నిర్వహించారు. సొసైటీలో 13 మంది సభ్యులు ఉండగా ఒకరు మరణించారు. ఇందులో తొమ్మిది మంది సభ్యులు అవిశ్వాస తీర్మానానికి అనుకూలంగా ఓటు వేశారు. అవిశ్వాస తీర్మానానికి అనుకూలంగా ఓటు వేసిన వారిలో సభ్యులు సంజీవరెడ్డి, మచ్చేందర్, బాబు, హరిసింగ్, కిషన్, లచ్చురామ్, బాల్‌రాజ్, చంద్రమ్మలు ఉన్నారు. మిగతా సభ్యులు గైర్హాజరయ్యారు. చైర్మన్ పదవిని చెరి రెండున్నర సంవత్సరాలు పంచుకోవాలని ఒప్పందం కుదిరినట్లు, ఒప్పందాన్ని కిషన్‌పవార్ సమ్మతించకపోవడంతో అవిశ్వాస తీర్మానానికి దారి తీసినట్లు బీఆర్‌ఎస్ వర్గాలు పేర్కొన్నాయి. కిషన్ పవార్ పదవీ కాలం పూర్తయినందున ఒప్పందంలో భాగంగా మచ్చేందర్‌కు అవకాశం కల్పించాలని సభ్యులు డిమాండ్ చేస్తూ వచ్చారు. ఇందుకు కిషన్‌రావు పవార్ సమ్మతించక పోవడంతో అవిశ్వాస తీర్మానానికి దారి తీసింది. అవిశ్వాస తీర్మానం నెగ్గినందున చైర్మన్ పదవికి ఈనెల 17వ తేదీన ఎన్నికలు నిర్వహిస్తామని డీసీఓ తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా సీఐ భూపతి, ఎస్‌ఐ శ్రీకాంత్ బందోబస్తు నిర్వహించారు.

పర్మనెంట్ అయ్యేనా?

- ఎదురుచూస్తున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులు
- ఏప్రిల్ 11తో నాలుగేళ్ల శిక్షణ కాలం పూర్తి
- ఇప్పటికైనా రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్



పెద్దాపూర్ పంచాయతీ కార్యాలయం

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): జూనియర్ పంచాయతీ కార్యదర్శుల ప్రొబేషన్ పీరియడ్ పూర్తయినా వారిని పర్మనెంట్ చేయడం లేదు. దీంతో వారు చాలీచాలని వేతనాలతో జీవితాన్ని లాక్కొస్తున్నారు. ఈ నెల 11వ తేదీతో నాలుగేళ్ల ప్రొబేషనరీ పీరియడ్ పూర్తయిందని.. ఇప్పటికైనా తమను ప్రభుత్వం పర్మనెంట్ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. లేనియెడల నిరవధిక సమ్మెకు దిగుతామని హెచ్చరిస్తున్నారు.

- ప్రైవేట్ ఉద్యోగాల కన్నా ప్రభుత్వ ఉద్యోగాలు మిన్న అనే ఉద్దేశంతో ప్రైవేట్ పరిశ్రమల్లో వేలాది రూపాయల జీతం ఉన్నా ఎంతో మంది వాటిని వదులుకొని జూనియర్ పంచాయతీ కార్యదర్శులుగా ఉద్యోగాలు పొందారు. కొలువులో చేరిన నాటి నుంచి ప్రభుత్వం వారిపై ఎన్నో నిబంధనలు విధిస్తున్నా భరించి ఉద్యోగాలు చేస్తున్నారు.
- సాధారణంగా ఏ ప్రభుత్వ ఉద్యోగానికైనా రెండేండ్ల ప్రొబేషనరీ పీరియడ్ ఉంటే.. జూనియర్ పంచాయతీ కార్యదర్శులకు మాత్రం నాలుగేళ్ల ప్రొబేషనరీ విధించారు. ఈ నాలుగేళ్ల పరిమితి సైతం ఈ నెల 11తో ముగిసింది. అయినా ప్రభుత్వం మాత్రం జేపీఎస్‌లను పర్మనెంట్ చేయడం లేదు. దీంతో ఆ ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తమ హక్కుల సాధనకు గత బుధవారమే ప్రభుత్వానికి సమ్మె నోటీసు ఇచ్చారు.

మూడేళ్ల ప్రొబేషనరీతోనే నియామకాలు

ప్రభుత్వం 2019లో జూనియర్ పంచాయతీ కార్యదర్శుల నియామకానికి నోటిఫికేషన్ ఇచ్చింది. పోటీ పరీక్షను నెగెటివ్ మార్కింగ్ విధానంలో నిర్వహించి రాష్ట్రంలో 9,355 మంది జూనియర్ పంచాయతీ సెక్రటరీలను నియమించారు. మొదట మూడేళ్ల ప్రొబేషనరీ పెట్టి రూ.15వేల చొప్పున జీతం చెల్లించారు. మూడేళ్ల ప్రొబేషనరీ ముగిసిన తర్వాత తమను పర్మనెంట్ చేయాలని కార్యదర్శులు ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చారు. దీంతో సీఎం కేసీఆర్ గత అసెంబ్లీ సమావేశాల్లో జేపీఎస్‌ల వేతనాలను రూ.15వేల నుంచి రూ.28,719కి పెంచి పర్మనెంట్ చేయకుండా ప్రొబేషనరీ పీరియడ్‌ను మరో ఏడాది పొడిగించారు.

పని ఒత్తిడితో సతమతం

గ్రామ పంచాయతీలో ప్రభుత్వ పథకాల అమలు, హరితహారం, శానిటేషన్, జనన, మరణ ధ్రువీకరణ పత్రాల జారీ, నివాస గృహాలు, ఇతర నిర్మాణ అనుమతులు, ఆస్తి మార్పిడి సర్టిఫికెట్లు, దుకాణాల లైసెన్సులు, ఉపాధి పనులు, విపత్తు నిర్వహణ తదితర పనులను ప్రభుత్వం పంచాయతీ సెక్రటరీలకే అప్పగించింది. దీంతో వారిపై పని ఒత్తిడి పెరగడంతో కొందరు ఉద్యోగాలకు రాజీనామా చేయగా, వారి స్థానాల్లో ఔట్ సోర్సింగ్ సిబ్బందిని నియమించి వేతనాలు చెల్లిస్తున్నారు. తమకు ప్రొబేషనరీ కార్యదర్శులతో సమానంగా వేతనాలివ్వాలని ఔట్ సోర్సింగ్ కార్యదర్శులు కోరుతున్నారు.

మొత్తం 443 మంది జేపీఎస్‌లు

జిల్లాలో 443 మంది జూనియర్ పంచాయతీ కార్యదర్శులున్నారు. ఇందులో 403 మంది నాలుగేళ్ల ప్రొబేషనరీ పీరియడ్‌ను పూర్తి చేసుకున్నారు. మిగతా వారు అవుట్‌సోర్సింగ్ సెక్రటరీలుగా కొనసాగుతున్నారు.

పని భారం తగ్గించాలి



పంచాయతీల్లో కార్యదర్శులకు పని భారాన్ని తగ్గించాలి. ఉదయం నుంచి సాయంత్రం ఆరు గంటల వరకూ విధులు నిర్వహిస్తున్నాం. అయినా మమ్మల్ని ప్రభుత్వం పర్మనెంట్ ఉద్యోగులుగా గుర్తించకపోవడం బాధాకరం. రిక్రూట్‌మెంట్ సమయంలో మూడేళ్లు అన్న ప్రొబేషనరీ పీరియడ్‌ను నాలుగేళ్లకు పెంచారు. దానిని పూర్తిచేసుకున్న వారిని వెంటనే పర్మనెంట్ చేయాలి.

– జగన్, జేపీఎస్ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు

పేస్కేల్ వర్తింపజేయాలి



పంచాయతీల్లో పని చేస్తున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులకు పే స్కేల్ ఇస్తూ పర్మనెంట్ ఉద్యోగులకు కల్పిస్తున్న బెనిఫిట్స్ అన్నీ వెంటనే వర్తింపజేయాలి. మా శ్రమను గుర్తించి ఉద్యోగాలను రెగ్యులరైజ్ చేస్తూ ఉత్తర్వులను జారీ చేయాలి.

– నర్సింలు, జేపీఎస్ సంఘం జిల్లా నాయకుడు

క్రమబద్ధీకరించాలి



పని భారంతో పంచాయతీ కార్యదర్శులు ఇబ్బందులు పడుతున్నారు. ఉద్యోగంలో చేరి నాలుగేళ్లు పూర్తయినా పర్మనెంట్ చేయకుండా ప్రభుత్వం నాన్చుతోంది. సీఎం కేసీఆర్ ఇచ్చిన మాట ప్రకారం ప్రొబేషనరీ పూర్తయిన వారందరినీ వెంటనే క్రమబద్ధీకరించాలి. ఇదే విషయమై మేం ప్రభుత్వానికి సమ్మె నోటీసు అందించాం. 15 రోజుల్లో రెగ్యులరైజ్ చేయకుంటే నిరవధిక సమ్మెకు దిగుతాం.

– రాజు, జేపీఎస్ సంఘం జిల్లా అధ్యక్షుడు

అన్ని వర్గాల ఆర్థికాభివృద్ధే లక్ష్యం

నారాయణఖేడ్ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్: అన్నివర్గాల ప్రజలు ఆర్థికంగా అభివృద్ధి సాధించాలన్నదే ప్రభుత్వ లక్ష్యం అని ఎమ్మెల్యే ఎం.భూపాల్‌రెడ్డి అన్నారు. మండలంలోని జూకల్ శివారులోని కన్వెన్షన్ హాలులో శనివారం గొర్రెల పంపిణీపై నియోజకవర్గంలోని గొల్లకుర్మలకు నిర్వహించిన అవగాహన సమావేశానికి హాజరై మాట్లాడారు. సబ్బండ వర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. నియోజకవర్గంలో రెండో విడతగా 1,284 గొర్రెల యూనిట్లు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. గతంలో ఏనాయకుడూ గొల్లకురుమలకు సముచిత స్థానం ఇవ్వలేదన్నారు. పేద పిల్లల చదువుల కోసం గురుకులాలను ఏర్పాటు చేయించామని పేర్కొన్నారు. గొర్రెల పంపిణీతో గొల్లకురుమలు ఆర్థికంగా ఎదిగేందుకు కృషిచేస్తున్న సీఎం కేసీఆర్ ఫ్లెక్సీకి పాలాభిషేకం చేసిన అనంతరం అందరితో కలిసి భోజనాలు చేశారు. నియోజకవర్గ కురుమ సంఘం అధ్యక్షుడు ప్రభాకర్, ఉపాధ్యక్షుడు మల్గొండ, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.



సీఎం కేసీఆర్ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

క్లుప్తంగా

ఆర్‌ఎంపీపై ఫిర్యాదు

నర్సాపూర్: తన పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడని ఓ మహిళ పోలీసులను ఆశ్రయించింది. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని పెద్దచింతకుంటకు చెందిన మహిళకు ఆర్‌ఎంపీ నరేందర్ వరుసకు బాబాయి. ఇంటికి వచ్చి ఫోన్ నంబర్ ఇవ్వాలని అడగడంతో పాటు అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడు. శనివారం ఉదయం భర్త ఇంట్లో లేనిసమయంలో నరేందర్ మహిళ ఇంటికి వచ్చి ఫోన్ నంబర్ అడగితే ఆమె ఇవ్వనని చెప్పడంతో అసభ్యంగా ప్రవర్తించాడు. ఆమె తిట్టడంతో వెళ్లిపోయాడు. భర్త ఇంటికిరాగానే విషయ చెప్పింది. సుమారు ఐదేళ్ల క్రితం ఇలాగే ప్రవర్తించాడని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. తనతో పాటు తన కుటుంబ సభ్యులకు నరేందర్‌తో ప్రాణహాని ఉందని ఆవేదన వ్యక్తం చేసింది. తన పట్ల అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై తగిన చర్యలు తీసుకోవాలని ఎస్‌ఐని కోరింది. ఈ విషయంపై ఎస్‌ఐ శివకుమార్‌ను వివరణ కోరగా తమకు ఫిర్యాదు వచ్చిందని చెప్పారు. విచారణ చేసి చర్యలు తీసుకుంటామన్నారు.

సివిల్ సప్లయి గోడౌన్‌పై విజిలెన్స్ దాడులు

తూప్రాన్: పేదలకు పంపిణీ కావల్సిన రేషన్ బియ్యం నిల్వల్లో భారీగా అక్రమాలు చోటు చేసుకున్నట్లు విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు శనివారం గుర్తించారు. మెదక్ జిల్లా తూప్రాన్‌లోని సివిల్ సప్లయి గోడౌన్‌పై విజిలెన్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. తనిఖీల్లో 4,743 క్వింటాళ్ల బియ్యం నిల్వల్లో తక్కువగా ఉన్నట్లు గుర్తించారు. వీటి విలువ సుమారు రూ.1.50 కోట్లు ఉంటుందన్నారు. కొన్నేళ్లుగా గోడౌన్ ఇన్‌చార్జిలు పనిచేసిన వారిని అదుపులోకి తీసుకొని విచారించనున్నట్లు తెలిపారు. పటాన్‌చెరులోని తమ ప్రధాన కార్యాలయానికి సోమవారం రావాలని ఆదేశించామన్నారు. ఇందుకు బాధ్యులైన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. గతంలోనూ సివిల్ సప్లయి గోడౌన్‌లో అక్రమాలు జరిగిన ఘటనలో ఇన్‌చార్జిలపై అధికారులు వేటు వేసిన సంఘటనలు ఉన్నాయి. అయిన అధికారుల తీరులో మార్పు రాకపోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి.


రికార్డులను పరిశీలిస్తున్న విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

వన్యప్రాణుల విలవిల

- తాగునీటి కోసం తండ్లాట
- అటవీప్రాంతంలో సాసర్‌పిట్లు, చెక్‌డ్యాంలు ఖాళీ
- నీటి కోసం గ్రామాల్లోకి చొరబడే అవకాశం
- నిధులు రావడంలేదని చేతులెత్తేసిన అటవీశాఖ


పర్వతాపూర్ బీట్‌లో ఖాళీగా సాసర్ పిట్

రామాయంపేట(మెదక్): ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కాకపోవడంతో ఈవేసవిలో వన్యప్రాణులకు తాగునీటి వసతి కల్పించే విషయమై ఆ శాఖ అధికారులు పట్టించుకోవడంలేదు. ఫలితంగా అవి తాగునీటికోసం అలమటిస్తున్నాయి. దంతేపల్లి, పర్వతాపూర్ అటవీప్రాంతంలో పర్యటించిన విలేకరులకు ఖాళీగా ఉన్న సాసర్‌పిట్లు అగుపించాయి. వివరాలు ఇలా ఉన్నాయి.

- జిల్లా పరిధిలో 58 వేల హెక్టార్లకు పైగా అటవీ ప్రాంతం విస్తరించి ఉంది. ఇందులో 400 పైగా సాసర్‌పిట్‌లు, చెక్‌డ్యాంలు, కుంటలు ఉన్నాయి.
- వేలాది వన్యప్రాణులు అటవీప్రాంతంలో మనుగడ సాగిస్తున్నాయి. ఏటా వేసవిలో వాటికి తాగునీటి వసతి కల్పించడానికి ఆశాఖ అధికారులు మార్చి మొదటి నుంచే సాసర్ పిట్లు, కుంటల్లో నీరు నింపే చర్యలు తీసుకుంటారు. దీంతో వణ్యప్రాణులు గ్రామాల్లోకి రాకుండా ఉంటాయి.
- గతంలో నీటివసతి కల్పించకపోవడంతో గ్రామాల్లోకి వచ్చి మృత్యువాత పడిన ఉదంతాలు ఉన్నాయి.
- ఐదేళ్ల క్రితం చిరుతలు అడవిని దాటి గ్రామాల్లోకి చొరబడి పశువులపై దాడి చేయడంతో మృత్యువాతపడ్డాయి.
- నీటికోసం అడవి నుంచి వస్తున్న వన్యప్రాణులు ప్రమాదాల బారినపడుతున్నాయి.
- ఐదేళ్ల క్రితం మండల పరిధిలోని కాట్రియాల తండాను ఆనుకునే ఉన్న అటవీప్రాంతంలో జంతువులకు తాగునీటికోసం వసతి కల్పించకపోవడంతో దాహంతో అలమటిస్తూ పదుల సంఖ్యలో వణ్యప్రాణులు మృత్యువాత పడ్డ సంఘటనను ‘సాక్షి’ బయటపెట్టింది.
- దీంతో ఆశాఖ అధికారులు అదనంగా సాసర్ పిట్‌లతోపాటు చెక్‌డ్యాంలు నిర్మించారు. తాజాగా శుక్రవారం సాక్షి ప్రతినిధులు మండల పరిధిలోని దంతేపల్లి, పర్వతాపూర్ అటవీప్రాంతంలో పర్యటించారు.
- ఖాళీగా ఉన్న సాసర్‌పిట్లు కనిపించాయి. వాటిలో చుక్కనీరు కూడా లేకపోగా, చెత్తాచెదారంతో నిండిపోయాయి.
- వీటిని నీటితో నింపితే జంతువులకు తాగునీటి సదుపాయం కలుగుతుందని, లేకపోతే అవి గ్రామాలకు వచ్చే అవకాశం ఉందని ఆయాగ్రామాలకు చెందిన ప్రజలు చెబుతున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం



అటవీ ప్రాంతంలో వన్యప్రాణులకు తాగునీటి వసతి కల్పించే విషయమై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. గతంలో సక్రమంగా చెక్‌డ్యాంలు, సాసర్‌పిట్‌లతో నీరు నింపాం. నిధుల కొరతతో ఈసారి కొంత ఆలస్యం జరిగింది. త్వరలో అటవీప్రాంతంలో వణ్యప్రాణులకు పూర్తిస్థాయిలో నీటి వసతి కల్పిస్తాం.

– రవిప్రసాద్, జిల్లా అటవీ అధికారి

రేషన్ బియ్యం పట్టివేత

- హైదరాబాద్ కాటేదాన్ నుంచి గుజరాత్ తరలిస్తున్న వైనం
- విశ్వనీయ సమాచారంతో పట్టుకున్న సివిల్ సప్లయి అధికారులు, పోలీసులు
- రెండు లారీల్లో తరలిస్తున్న 610 క్వింటాళ్ల రేషన్ బియ్యం


రేషన్ బియ్యం లారీని సీజ్ చేసిన అధికారులు

పటాన్‌చెరు టౌన్: లారీలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని అధికారులు పట్టుకున్నారు. ఈ సంఘటన పటాన్‌చెరు మండల పరిధిలోని రుద్రారం గ్రామ సమీపంలోని రాజస్థాన్ జోధ్‌పూర్ డాబా వద్ద జరిగింది. సివిల్ సప్లయి డీటి(డిప్యూటీ తహసిల్దార్) సురేశ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. హైదరాబాద్ రాజేంద్రనగర్ కాటేదాన్ నుంచి గుజరాత్ కు రెండు లారీల్లో అక్రమంగా సుమారు 610 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నారన్నారు. విశ్వనీయ సమాచారం మేరకు సివిల్ సప్లయి అధికారులు, పోలీసులు సంయుక్తంగా పటాన్‌చెరు మండలం రుద్రారం జోధ్‌పూర్ డాబా వద్ద జీజె 32 వీ 9925 లారీ, జీజె 03 బీవై 9407 లారీలను పట్టుకున్నారు. పట్టుకున్న రెండు లారీలను సీజ్ చేసి, రేషన్ బియ్యాన్ని అదనపు కలెక్టర్ ఆదేశాల మేరకు పటాన్‌చెరు ఎంఎల్ఎస్ గోదాముకు తరలించారు. ఆరుగురిపై కేసునమోదు చేశారు. లారీ డ్రైవర్లు మోరి సామత్, ముక్వన రాజు భాయ్‌ని అదుపులోకి తీసుకొన్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చెరువులో మునిగి యువకుడి మృతి


మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఐ సుభాశ్ గౌడ్

వెల్దుర్తి(తూప్రాన్): వెల్దుర్తి మండలం కుకునూర్ గ్రామ శివారులోని నల్లకుంటలో వెల్దుర్తి గ్రామానికి చెందిన ఎరుకలి భిక్షపతి(40) నీటమునిగి మృతిచెందాడు. తమ్ముడి పిల్లలను చూడడానికి వెళ్లి మృత్యువాత పడటంతో గ్రామంలో విషాదం నెలకొంది. కుంటలో చేపలు పట్టడానికి వెళ్లి మృతిచెందాడా లేక స్నానానికి వెళ్ళి చేపలకోసం జాలరులు వేసిన వల చుట్టుకొని మృతిచెందాడా అనే అనుమానాలు రేకెత్తుతున్నాయి. ఈ విషయమై ఎస్‌ఐ మధుసూదన్‌గౌడ్‌ను వివరణ కోరగా తమకు ఫిర్యాదు అందలేదన్నారు.

చేపల కోసం విసరిన వలలో చిక్కి..

చిన్నశంకరంపేట(మెదక్): చేపల కోసం విసరిన వలలో చిక్కుకుని మత్సకారుడు చెరువులో మునిగి మృతి చెందాడు. ఈ సంఘటన మండలంలోని టి.మాందాపూర్ గ్రామంలో జరిగింది. శనివారం చిన్నశంకరంపేట ఎస్‌ఐ సుభాశ్‌గౌడ్ కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. టీ.మాందాపూర్ గ్రామానికి చెందిన మాడబోయిన నర్సింహులు(45) శనివారం తెల్లవారుజామున పెద్దచెరువులో చేపలు పట్టేందుకు వెళ్లాడు. చేపల కోసం విసిరిన వలలో చిక్కుకుని చెరువులో మునిగి మృతి చెందినట్లు గుర్తించారు. విషయం తెలుసుకున్న పోలీస్‌లు అక్కడికి చేరుకుని గ్రామస్తుల సహాయంతో చెరువులో గాలించి నర్సింహులు మృతదేహాన్ని బయటకు తీశారు. భార్య యాదమ్మ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఒక చేతిలో స్టీరింగ్.. మరొక చేతిలో పావురం..

- జాతీయ రహదారిలోని గుంతలోకి దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు
- తప్పిన పెను ప్రమాదం


గుంతలో దిగబడిన బస్సు

రామచంద్రాపురం(పటాన్‌చెరు) ఆర్టీసీ బస్సు డ్రైవర్ ఒక చేతిలో పావురాన్ని పట్టుకొని, మరో చేతితో బస్సును నడపటంతో అదుపు తప్పి బస్సు జాతీయరహదారి పక్కన ఉన్న గుంతలోకి దూసుకు పోయింది. ఈ సంఘటన శనివారం మధ్యాహ్నం రామచంద్రాపురం పట్టణంలోని గండమ్మ ఆలయం సమీపంలో జరిగింది. ప్రయాణికులు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. హెచ్‌సీయు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు సికింద్రాబాద్ నుంచి పటాన్‌చెరుకు వస్తోంది. బస్సు వస్తున్న క్రమంలో కేపీహెచ్‌బీ వద్ద ఓ పావురం బస్సుకు ఎదురుగా వచ్చింది. దాంతో బస్సు డ్రైవర్ దస్తగిర్ బస్సును ఆపి ఆ పావురాన్ని పట్టుకోమని ఓ ప్రయాణికుడికి చెప్పాడు. అతడు పావురాన్ని పట్టుకొని బస్సులో కూర్చున్నాడు. ప్రయాణికుడు లింగంపల్లిలో బస్సు దిగుతూ ఆ పావురాన్ని డ్రైవర్ దస్తగిరికు ఇచ్చాడు. లింగంపల్లి నుంచి జ్యోతినగర్ వరకు జాతీయ రహదారిపై ఫ్లయిఓవర్ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. అందులో భాగంగా గండమ్మ ఆలయం సమీపంలో రోడ్డు పక్కన పెద్ద గుంత తవ్వారు. ప్రమాదాలు జరగకుండా సిమెంట్ దిమ్మెలను ఏర్పాటు చేశారు. డ్రైవర్ బస్సును కొంచెం వేగంగా నడపటంతో అదుపు తప్పి సిమెంట్ దిమ్మెలను ఢీకొని గుంతలోకి దూసుకు పోయింది. ఆ సయంలో బస్సులు సుమారు 30 మంది ప్రయాణికులున్నారు. అందరు స్వల్పగాయలతో బయట పడారు. గాయపడిన వారు ఆస్పత్రిలో చికిత్స అనంతరం ఆటోల్లో వెళ్లిపోయారు. దీంతో అందరూ ఊపిరి పిల్చుకున్నారు.

కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాలకు న్యాయం


మాట్లాడుతున్న అజారుద్దీన్, పక్కన కత్తి కార్తీక

దుబ్బాకటౌన్: కాంగ్రెస్ పార్టీతోనే అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని, రాష్ట్రంలో అధికారంలోకి రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ క్రికెటర్ అజారుద్దీన్ అన్నారు. శనివారం దుబ్బాకలో కాంగ్రెస్ నాయకురాలు కత్తి కార్తీకగౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఇఫ్తార్ విందులో మాట్లాడారు. తెలంగాణలో నిరంకుశ పాలనకు ప్రజలు చరమగీతం పాడేందుకు సిద్ధంగా ఉన్నారని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం మైనార్టీలను ఓటు బ్యాంకుగా వాడుకుంటుందని విమర్శించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కొత్త దేవిరెడ్డి, మజీద్ కమిటీ అధ్యక్షుడు ఖలీల్ తదితరులు ఉన్నారు.

అయ్యో ‘పాప’ం

- రోడ్డు పక్కన అప్పుడే పుట్టిన ఆడశిశువు
- వదిలి వెళ్లిన గుర్తుతెలియని వ్యక్తులు
- ఐసీడీఎస్, పోలీసులకు సమాచారమిచ్చిన స్థానికులు
- సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి శిశువు తరలింపు


గుర్తుతెలియని వ్యక్తులు వదిలి వెళ్లిన ఆడశిశువు

పటాన్‌చెరు టౌన్: మానవత్వం రాను రాను మంటగలుస్తోంది. తల్లి పొత్తిళ్లలో వెచ్చగా నిద్రించాల్సిన పసిగుడ్డు అనాథగా మిగిలింది. అప్పుడే పుట్టిన ఆడశిశువును గుర్తుతెలియని వ్యక్తులు రోడ్డు పక్కన వదిలి వెళ్లారు. ఈ దయనీయ సంఘటన భానూర్–బీడీఎల్ పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. బీడీఎల్ ఎస్‌ఐ సాయిలు, ఐసీడీఎస్ సీడీపీఓ చంద్రకళ, సూపర్‌వైజర్ సల్మా తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పటాన్‌చెరు మండలం క్యాసారం ఎస్సీ కాలనీలో అప్పుడే పుట్టిన ఆడశిశువు రోడ్డు పక్కన శనివారం తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తులు వదిలి వెళ్లారు. చిన్నారి ఏడుపు విన్న స్థానికులు వెంటనే ఐసీడీఎస్ అధికారులు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సల్మా, ఎస్‌ఐ సాయిలు సంఘటన స్థలానికి చేరుకొని శిశువును సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పాప ఆరోగ్యంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు.

ముగ్గురి అదృశ్యం


వసంత (ఫైల్)

పటాన్‌చెరు టౌన్: భార్య కనిపించడంలేదని భర్త పోలీసులకు ఫిర్యాదు చేశాడు. శనివారం ఎస్‌ఐ ప్రసాద్ రావు కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్ డీఎస్ కాలనీకి చెందిన శ్రీధర్ ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. ఈనెల 13వ తేదీన శ్రీధర్ డ్యూటీకి వెళ్లాడు. సాయంత్రం ఇంటికి రాగా భార్య వసంత కనిపించలేదు. అంతేకాకుండా ఆమెకు సంబంధించిన వస్తువులు ఇంట్లో కనిపించలేదు. దీంతో భార్య కోసం తెలిసిన వారిని, బంధువులను విచారించినా ఆమె ఆచూకీ లభించలేదు. భార్య కనిపించడంలేదని శ్రీధర్ పోలీసులు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.


లక్ష్మి (ఫైల్)

పటాన్‌చెరు టౌన్: తల్లి కనిపించడంలేదని కుమారుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. శనివారం ఎస్‌ఐ దుర్గయ్య కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్ భాస్కర్ ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. 12వ తేదీన భాస్కర్ తల్లి లక్ష్మి ఇంట్లో గొడవపడి ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయింది. డీఎస్ కాలనీలో ఉండే పెద్దమ్మ ఇంటికి వెళ్లి ఉంటుందని కుమారుడు భావించాడు. అక్కడికి వెళ్లగా తల్లి కనిపించలేదు. దీంతో తెలిసిన వారిని, బంధువులను విచారించినా ఆమె ఆచూకీ లభించలేదు. తల్లి కనిపించడంలేదని కుమారుడు భాస్కర్ శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదుచేసుకొనిదర్యాప్తు చేస్తున్నారు.


మహేశ్ (ఫైల్)

నారాయణఖేడ్: గిరిజ బాలుర పాఠశాల విద్యార్థి కనిపించకుండా పోయాడు. వివరాలు ఇలా ఉన్నాయి. నారాయణఖేడ్ మండలం జూకల్ శివారులోని డబుల్‌బెడ్‌రూం ఇళ్ల సమీపంలోని గిరిజ బాలుర గురుకులంలో 9వ తరగతి చదువుతున్న వై.మహేశ్(17) అదృశ్యమైనట్లు ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి శనివారం తెలిపారు. శుక్రవారం సాయంత్రం మామిడి కాయల కోసమని గురుకులం ప్రహరీదూకి వెళ్లి తిరిగి రాలేదని ప్రిన్సిపాల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసునమోదు చేసుకుని రెండు ప్రత్యేక టీంలను ఏర్పాటు చేసి గాలింపు చర్యలు చేపట్టినట్లు చెప్పారు.

ప్రిన్సిపాల్ నిలదీత

గురుకులంలో 9వ తరగతి విద్యార్థి మహేశ్ అదృశ్యం కావడంతో శనివారం సాయంత్రం అతడి కుటుంబీకులు ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్‌ను నిలదీశారు. శుక్రవారం అదృశ్యమైతే తమకు ఎందుకు సమాచారం ఇవ్వలేదని ప్రశ్నించారు. ప్రిన్సిపాల్, ఉపాధ్యాయుల నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లే తమ కుమారుడు అదృశ్యమయ్యాడని ఆరోపించారు.

మూడు ట్రాక్టర్లకు నిప్పుపెట్టిన దుండగులు

- పొలం పనుల తర్వాత గ్రామ శివారులో ఉంచిన ట్రాక్టర్లు
- తగులబెట్టిన గుర్తు తెలియని వ్యక్తులు

మెదక్ రూరల్: మూడు ట్రాక్టర్లకు గుర్తుతెలియని దుండగులు నిప్పుపెట్టిన సంఘటన మెదక్ మండలం మల్కాపూర్‌లో శనివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మల్కాపూర్ తండాలోని పరమేశ్‌కు చెందిన రెండు ట్రాక్టర్లు, గోపాల్‌కు చెందిన ట్రాక్టర్‌ను శనివారం సాయంత్రం పొలం పనులు పూర్తయని తరువాత రాయిన్‌పల్లి శివారు ఎరుకల ఎల్లవ్వ పొలంలో ఉంచి ఇంటికి వెళ్లారు. అదే రోజు రాత్రి 1.30 గంటలకు గుర్తుతెలియని వ్యక్తులు ట్రాక్టర్లకు నిప్పు పెట్టారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

విద్యుత్ చౌర్యం కేసులో నిందితుడి రిమాండ్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): విద్యుత్ అక్రమ వినియోగం కేసులో గజ్వేల్ మండల పరిధిలోని శ్రీగిరిపల్లి గ్రామస్తుడికి రిమాండ్ విధించినట్లు సిద్దిపేట విద్యుత్‌శాఖ విజిలెన్స్ అధికారులు శనివారం తెలిపారు. అక్రమంగా విద్యుత్ వినియోగిస్తున్న వడ్డెర ఎల్లంపై మార్చి 13వ తేదీన విద్యుత్‌శాఖ విజిలెన్స్ అధికారులు కేసు నమోదు చేశారు. శనివారం సిద్దిపేట కోర్టులో హాజరు పరుచగా, కోర్టు ఉత్తర్వుల మేరకు జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించినట్లు విద్యుత్‌శాఖ విజిలెన్స్ అధికారులు తెలిపారు

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

మెదక్ రూరల్: హవేళిఘణాపూర్ మండలం బోగుడ భూపతిపూర్ చెరువులో శనివారం గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామ శివారులోని చెరువులో మృతదేహం ఉన్నట్లు గమనించిన పశువుల కాపరులు సర్పంచ్‌కు సమాచారం ఇచ్చారు. ఈ విషయాన్ని పోలీసుల దృష్టికి తీసుకెళ్లడంతో వారు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని చెరువు నుంచి బయటకు తీసి పోస్టుమార్టం నిర్వహించారు. మృతుడి వివరాలు సేకరిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గేదెను కట్టేయబోయి..

కిందపడి రైతు మృతి


చంద్రయ్య (ఫైల్)

చిన్నకోడూరు(సిద్దిపేట): గేదెను కట్టేసే క్రమంలో కిందపడి రైతు మృతి చెందాడు.ఈ సంఘటన శుక్రవారం రాత్రి జరిగింది. పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని చంద్లాపూర్ గ్రామానికి చెందిన పుప్పాల చంద్రయ్య(52)కు భార్య బాల్‌లక్ష్మి, ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు. వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. చంద్రయ్యకు బోధకాలు ఉండటంతో తరచూ జ్వరం వస్తుంది. ఈ క్రమంలో శుక్రవారం మధ్యాహ్నం చంద్రయ్య గేదెలను పొలం వద్ద కట్టేసి వస్తానని చెప్పి ఇంటి నుంచి వెళ్లాడు. రాత్రి వరకు తిరిగి రాకపోవడంతో అతడి కోసం వెతికారు. పొలం వద్ద కిందపడి కనిపించాడు. గేదెను కట్టేసే క్రమంలో అది గుంజుకుపోవడంతో కింద పడి మృతి చెంది ఉంటాడని కుటుంబీకులు పేర్కొన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శివానందం తెలిపారు.

లారీ టైర్ పేలి వ్యక్తి మృతి

జహీరాబాద్ టౌన్: లారీ టైర్ పేలిన సంఘటనలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన చిరాగ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ కాశీనాథ్ కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని వెంకటరమణ నగర్ కాలనీకి చెందిన కృష్ణమూర్తి 65వ జాతీయ రహదారిపై సత్వార్ రాందేవ్ దాబా వద్ద టైర్ పంక్చర్ షాపు ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం రాత్రి పంక్చర్ అయిన టైర్‌కు రిపేర్ చేసి లారీకి బిగిస్తున్నాడు. ఒక్కసారిగా టైర్ పేలి కృష్ణమూర్తి దూరంగా ఎగిరిపడ్డాడు. తీవ్రగాయాలైన ఆయనను జహీరాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్సపొందుతూ మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదం

ముగ్గురికి గాయాలు


గాయపడ్డ డ్రైవర్

రామాయంపేట(మెదక్): నార్సింగి మండలం జప్తిశివునూర్ వద్ద శనివారం కారు చెట్టును ఢీకొంది. ఈ సంఘటనలో ముగ్గురు గాయపడ్డారు. బాధితులు విమానాశ్రయం నుంచి కామారెడ్డి జిల్లా కుప్రియాల్ గ్రామానికి వెళ్తుండగా జప్తిశివునూర్ వద్ద కారు అదుపుతప్పి చెట్టును ఢీకొంది. ఈ ప్రమాదంలో డ్రైవర్ శ్రీరాంకు తీవ్రంగా, మరో ఇద్దరికి స్వల్పంగా గాయాలయ్యాయి. ఆస్పత్రిలో ప్రథమ చికిత్స అనంతరం వారు తమ స్వగ్రామానికి వెళ్లిపోయారు. ప్రమాదంపై తమకు ఫిర్యాదు అందలేదని నార్సింగి ఎస్‌ఐ నర్సింహులు తెలిపారు.

బాలుడిపై కేసు నమోదు

శివ్వంపేట(నర్సాపూర్): బాలికను కిడ్నాప్ చేసిన కేసులో బాలుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రవికాంత్‌రావు శనివారం తెలిపారు. మండల పరిధి గోమారానికి చెందిన బాలిక(16)ను లచ్చిరెడ్డిగూడంకు చెందిన బాలుడు రెండు రోజుల క్రితం కిడ్నాప్ చేశాడు. బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు ఇద్దరు మైనర్లను గుర్తించడం జరిగిందని, బాలికను భరోసా కేంద్రానికి తరలించారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

- సిద్దిపేట సీపీ శ్వేత
- మూడు నేరాల వివరాలు మీడియాకు వెల్లడి

సిద్దిపేటకమాన్: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాని సిద్దిపేట సీపీ శ్వేత అన్నారు. సిద్దిపేట పట్టణంలో సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయి డబ్బులు పొగొట్టుకున్నారు. సీపీ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణానికి చెందిన ఓ వ్యక్తికి గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి ట్రేడింగ్ టెలిగ్రామ్ యాప్‌లో డబ్బులు పెట్టుబడిగా పెడితే రెట్టింపు లాభాలు వస్తాయని నమ్మబలికాడు. అది నమ్మిన బాధితుడు రూ.12వేలు ఆన్‌లైన్‌లో పెట్టుబడిగా పెట్టాడు. తర్వాత ఆ నంబర్‌కు ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ రావడంతో తాను మోసపోయినట్లు గ్రహించి వెంటనే జాతీయ హెల్ప్‌లైన్ నంబర్‌కు ఫిర్యాదు చేశాడు.

హోటల్‌లో రూమ్ కోసం..

పట్టణానికి చెందిన ఓ వ్యక్తి బెంగుళూరులోని ఓ హోటల్‌లో రూమ్ బుక్ చేసుకోవడానికి ఆన్‌లైన్‌లో హోటల్ నంబర్ వెతికాడు. ఆన్‌లైన్లో కనిపించిన నంబర్‌కు ఫోన్ చేయగా అడ్వాన్స్‌గా కొంత మొత్తం చెల్లించాలని సూచించాడు. దీంతో బాధితుడు ఆన్‌లైన్‌లో గుర్తు తెలియని వ్యక్తి సూచించిన నంబర్‌కు రూ.19,010 పంపించాడు. తర్వాత ఆ నంబర్‌కు ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ రావడంతో జాతీయ హెల్ప్‌లైన్ నెంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేశాడు.

ఆర్మీ జవాన్ పేరుతో ..

పట్టణానికి చెందిన ఓ వ్యక్తికి గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి ఆర్మీ జవాన్ అంటూ పరిచయం చేసుకున్నాడు. అతడికి ఆయుర్వేద మందులు కావాలని డబ్బులు పంపిస్తానని నమ్మించాడు. బాధితుడు డబ్బులు వస్తాయని ఆశపడి సైబర్ నేరగాడు సూచించిన విధంగా పేటీఎం యాప్‌లో ఓటీపీ వివరాలు నమోదు చేయడంతో తన ఖాతా నుంచి రూ.12,999 డబ్బులు డెబిట్ అయినట్లు ఫోన్‌కు మెసేజ్ వచ్చింది. దీంతో బాధితుడు జాతీయ హెల్ప్‌లైన్ నంబర్ 1930కు ఫిర్యాదు చేశాడు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగినికి బురిడీ

పటాన్‌చెరు టౌన్: పార్ట్ టైం జాబ్ ఆఫర్ అంటూ అపరిచిత వ్యక్తి నుంచి వచ్చిన వాట్సాప్ మెసేజ్‌కు స్పందించిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని పెద్దమొత్తంలో నగదు పోగొట్టుకుంది. ఈ ఘటన అమీన్‌పూర్ పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. అమీన్‌పూర్ పరిధిలోని ఓ కాలనీకి చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని రచనకి ఈనెల 8వ తేదీన వాట్సాప్ ద్వారా పార్ట్ టైం ఉద్యోగం అంటూ మెసేజ్ రావడంతో లింక్ క్లిక్ చేసింది. దీంతో టెలిగ్రామ్ ద్వారా ఓ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. బాధితురాలు వారు చెప్పిన విధంగా వివరాలను నమోదు చేసింది. మెదట రూ.వెయ్యి నుంచి ఇన్వెస్ట్ చేస్తూ, వారు చెప్పిన విధంగా టాస్కులు చేస్తూ, పలు దఫాలుగా మొత్తం రూ.8.35 లక్షల నగదును ఇన్వెస్ట్ చేసింది. ఇన్వెస్ట్ చేసిన నగదును ఒకేసారి డ్రా చేసుకోవచ్చని చెప్పి నమ్మబలికారు. కమీషన్ తో పాటు పెట్టిన నగదును ఇవ్వాలని బాధితురాలు అడగటంతో అతడె స్పందించలేదు. దీంతో తాను మోసపోయినట్లు గ్రహించిన రచన ముందుగా సైబర్ క్రైం లో ఫిర్యాదు చేసి, అనంతరం అమీన్‌పూర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.